క్లుప్తంగా

సమాజ్‌వాదీ పార్టీ నగర అధ్యక్షులుగా నబీసా

కర్నూలు(అర్బన్): సమాజ్‌వాదీ పార్టీ నగర అధ్యక్షులుగా నబీసాను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షులు జే శ్రీనివాసులునాయుడు తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పాశ్యం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు నగర అధ్యక్షుడిని నియమించి, నియామకపత్రాన్ని అందించామన్నారు.

మహిళ మెదడులో కణితి

● 14 గంటలు శ్రమించి తొలగించిన వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): మెదడులో భారీ కణితితో బాధపడుతున్న 48 ఏళ్ల మహిళకు కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు శస్త్రచికిత్స చేసి ఊరట కల్పించారు. కర్నూలుకు చెందిన ఈశ్వరమ్మకు మాట తడబడటంతో పాటు తీవ్రమైన తలనొప్పితో ఇబ్బంది పడేది. కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పగా కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ సుమంత్ కుమార్ పరీక్షించి మెదడులోని ఎడమవైపు టెంపోరల్ స్కల్ బేస్ ప్రాంతంలో భారీ కణితి ఏర్పడినట్లు గుర్తించారు. 'మెదడులో ఎడమవైపు టెంపోరల్ ప్రాంతం మాటకు, జ్ఞాపకశక్తికి సంబంధించి ఉంటుంది. సరిగ్గా ఈ ప్రాంతాన్ని ఆనుకునే భారీ కణితి ఏర్పడింది. ఇటీవల ఆమెకు 14 గంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించి కణితి తొలగించాం. ప్రస్తుతం ఆమె పూర్తిస్థాయిలో సాధారణ స్థితికి చేరుకుంది' అని డాక్టర్ సుమంత్ కుమార్ వివరించారు.

కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌కు సన్మానం



డాక్టర్ సుధాకర్ దంపతులను సన్మానిస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): పదవీ విరమణ చేసిన కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో కళాశాలలోని న్యూ లెక్చరర్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి పాల్గొని మాట్లాడారు. డాక్టర్ సుధాకర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ, డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ సాయిసుధీర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షులు డాక్టర్ శ్రీరాములు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ సంక్షేమ బోర్డుకు నిధులు కేటాయించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు నుంచి రూ.450 కోట్లను దారి మళ్లించిందన్నారు. వెంటనే ఆ నిధులను కేటాయించి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి చంద్రశేఖర్, సి.రెహమాన్ పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి



బాధితులను పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఇటీవల సుందరయ్య నగర్‌లో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ముగ్గురు బాధితులకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.సుధాకరప్ప డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం నాయకులు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో మద్దమ్మ, శివమ్మ, కాశమ్మ కొట్టాలు కాలిపోయి నిరాశ్రయుల య్యారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.దావీదు, రామాంజనేయులు, ముక్తార్ పాల్గొన్నారు.

ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌ను సస్పెండ్ చేయాలి

కర్నూలు కల్చరల్: రాష్ట్ర విద్యా పరిశోధనా సంస్థను కుల పరిశోధనా సంస్థగా మార్చిన ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌ను సస్పెండ్ చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు గురువారం డీఈఓ శామ్యూల్‌కు వినతి ప్రతం అందజేశారు. 8వ తరగతి ఫార్మాటివ్ అసెస్మెంట్ సాంఘిక శాస్త్ర పరీక్షలో దళిత నాయకుడు ఎవరంటూ దానికి సమాధానంగా అంబేడ్కర్ పేరును సూచించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దీనికి కారకుడైన ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సంఘం నాయకులు భాస్కర్, రామశేషయ్య, సుధాకర్ డిమాండ్ చేశారు.

దాహం తీర్చేందుకు..



గాజులదిన్నె ప్రాజెక్టు



నీటిని తరలించేందుకు ముమ్మరంగా చేపడుతున్న పనులు

కర్నూలు (టౌన్) : వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు నగరపాలక సంస్థ ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. సమస్య పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ప్రతి ఏడాది వేసవిలో నీటి ఎద్దడితో ఇబ్బంది పడే కాలనీలను అధికారులు ఇప్పటికే గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో నీటి ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేసేందుకు చర్యలు సైతం చేపట్టారు. నగరపాలక సంస్థకు చెందిన నీటి ట్యాంకర్లతో పాటు బాడుగ పద్ధతిలో అదనంగా ట్యాంకర్లు తీసుకుంటున్నారు. దీంతో పాటు నగరంలోని 52 వార్డుల పరిధిలో ఉన్న బోర్లను రిపేరు చేయడం, తాత్కాలికంగా నీటి ట్యాంకులు ఏర్పాటు చేయడం, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం వంటి పనులు చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన బడ్జెట్ ఖరారు చేశారు

రూ. 1.80 కోట్లు బడ్జెట్ కేటాయింపు

ప్రతి వేసవిలో నగర ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడకుండా నగరపాలక ఇంజినీరింగ్ విభాగం అధికారులు సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందిస్తారు. కాలనీల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటారు. ఈ సారి వేసవికి కూడా అదే విధంగా మార్చి నుంచి సెప్టెంబర్ నెలలను పరిగణలోకి తీసుకొని రూ. రూ.1.80 కోట్ల బడ్జెట్ కేటాయించారు. ఈ బడ్జెట్ ద్వారా వచ్చే సెప్టెంబర్ నెల వరకు మంచి నీటి సమస్య ఏర్పడకుండా చూస్తారు. రూ.45 లక్షలతో చేతి పంపులు, బోర్‌వెల్స్, పైపులైన్ మరమ్మతులు, మరో రూ.45 లక్షలతో అవసరమైన చోట కొత్త బోర్‌వెల్స్, 1.5 హెచ్‌పీ మోటార్ల ఏర్పాటు చేయనున్నారు. నీటి ఎద్దడి ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు రూ.45 లక్షలు ఖర్చు చేయనున్నారు.కోడుమూరు అర్బన్ నియోజకవర్గ పరిధిలో బోర్‌వెల్స్, ఫ్లాట్‌పామ్స్, 1.5 హెచ్‌పీ మోటార్ల ఏర్పాటుకు రూ.45 లక్షలు వినియోగించనున్నారు.

శాశ్వత పరిష్కారానికి పటిష్ట చర్యలు

సుంకేసుల నుంచి వచ్చే నీటిని కర్నూలు నగరవాసులు వినియోగిస్తున్నారు. అయితే అక్కడి నుంచి మునగాలపాడు పంపింగ్ స్టేషన్‌కు నీరు చేరుకోవాలంటే 23 కి.మీ. ప్రయాణం చేయాల్సి ఉంది. సుంకేసుల నుంచి ఓపెన్ చానల్ ద్వారా నీటిని సరఫరా చేయడంలో మధ్యలో నీటి ఆవిరితో పాటు పెద్ద ఎత్తున్న నీటి చౌర్యం జరుగుతుంది. సమీపంలోని రైతులు మోటార్లు వేసుకొని తాగునీటిని తోడేస్తున్నారు. దీంతో శాశ్వతంగా ఈ సమస్యను పరిష్కరించేందుకు రూ.82 కోట్లు వెచ్చించి సుంకేసుల నుంచి మునగాలపాడు వరకు పైపులైన్ వేస్తున్నారు. యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్న ఈ పనులు త్వరగా పూర్తి అయితే భారీ స్థాయిలో నీటి వృథాను అరికట్టినట్టు అవుతుంది. ఇదిలా ఉంటే మునగాలపాడు పంపింగ్ స్టేషన్ ప్రాంగణంలోనే 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ.15.10 కోట్లు వెచ్చించి 15 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంటు ప్లాంటు పనులు పూర్తి చేశారు. దీని వల్ల అదనంగా కల్లూరు ప్రజలకు శుద్ధి చేసిన నీరు అందుతుంది.

జీడీపీలో నీటి నిల్వకు చర్యలు

నగర ప్రజల తాగునీటికి సుంకేసుల రిజర్వాయర్‌లో సరిపడా నీటి నిల్వలు లేవు. దీంతో ప్రత్యామ్నాయంగా గాజుల దిన్నె ప్రాజెక్టులో కర్నూలు నగర వాసుల తాగునీటి అవసరాలు తీర్చేందుకు 1.2 టీఎంసీ నీటిని నిల్వ చేసేందుకు ఇప్పటికే నగరపాలక అధికారులు ప్రభుత్వానికి విన్నవించారు. అక్కడి నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. దీంతో జీడీపీ నుంచి ప్రతి రోజు 30 నుంచి 40 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఈనెల 19 వ తేదీ నుంచే తుంగభద్ర నుంచి ప్రతి రోజు 250 క్యూసెక్కుల నీటిని గాజుల దిన్నె ప్రాజెక్టుకు తరలిస్తున్నారు. ప్రస్తుతం సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో 20 రోజులకు సరిపడ నీరు ఉంది. ఈ నేపథ్యంలో జీడీపీలో నీటి నిల్వకు చర్యలు తీసుకున్నారు.

నీటి సమస్య ఉత్పన్నమయ్యే కాలనీల గుర్తింపు

వేసవిలో నగరంలో 23 కాలనీల్లో తాగునీటి సమస్య తలెత్తుతుందని అధికారులు గుర్తించారు. స్టాంటన్‌పురం, సోనియాగాంధీనగర్, అంబేడ్కర్‌నగర్, సమతానగర్, మమతానగర్, గీతా ముఖర్జీనగర్, ధనలక్ష్మీనగర్, సోమిశెట్టి నగర్ తదితర కాలనీలను గుర్తించారు. పైపులైన్ పూర్తి స్థాయిలో లేని కాలనీల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

తాగు నీటి సమస్య తలెత్తనివ్వం



వచ్చే వేసవిలో నగర ప్రజలకు తాగునీటి సమస్య ఎదురుకాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాం. శివారు కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తాం. ఇందుకు ముందస్తుగా బడ్జెట్ రూపొందించాం. ప్రస్తుతం సుంకేసుల నీటిని వాడుకుంటున్నాం. ప్రత్యామ్నాయంగా గాజుల దిన్నె ప్రాజెక్టులో 1.2 టీఎంసీల నీటిని నగరవాసుల కోసం నిల్వ చేస్తున్నాం. సెప్టెంబర్ వరకు నగర వాసులకు ఎలాంటి నీటి ఇబ్బందులు ఉండవు.

– శేషాసాయి, మున్సిపల్ ఈఈ

దాతల సేవలు అభినందనీయం



బాధితులకు సరుకులు అందిస్తున్న ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు:దాతల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కల్లూరు అర్బన్ 32వ వార్డు పరిధిలోని సుందరయ్యనగర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో కొట్టాలు దగ్ధమై, నిత్యావసర సరులు, వస్తువులు కోల్పోయిన బాధితులకు గురువారం ఎమ్మెల్యే స్వగృహంలో వంట పాత్రలు, నిత్యావసర సరుకులు, దుస్తులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేటర్లు సానశ్రీనివాసులు, నరసింహులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. గురువారం కాలుష్య నియంత్రణ మండలితో కలిసి నేషనల్ ఎయిర్ క్లీన్ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ ఎదుట జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. శ్రీనివాసనగర్, ప్రకాష్ నగర్ మీదుగా నగర పాలక నూతన కౌన్సిల్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. నగరంలో ప్లాస్టిక్ నిషేధానికి ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షాకీర్ హుస్సేన్, కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ముని ప్రసాద్, డీఈఈ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంపై విద్యార్థుల్లో చైతన్యం



విద్యార్థినులకు జ్ఞాపికలు అందజేస్తున్న డాక్టర్ కేజీ గోవిందరెడ్డి

కర్నూలు(హాస్పిటల్): అవయవదానంపై విద్యార్థుల్లో చైతన్యం వచ్చిందని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి అన్నారు. స్థానిక డాక్టర్స్ కాలనీలోని భాష్యం స్కూల్‌లో జరిగిన సైన్స్ ఎక్స్‌పోలో అవయవదానంపై 9వ తరగతి విద్యార్థినులు సోఫియా, లలిత, వాసవి ప్రజలకు అవగాహన కల్పించి, అవయవదానంపై అంగీకార పత్రాలు పూర్తి చేయించి, వాటిని రెడ్‌క్రాస్‌కు అందించడం అభినందనీయమన్నారు. గురువారం సదరు విద్యార్థులను కలిసి ఆయన అభినందించి ప్రోత్సాహక బహుమతులు అందించారు. బాలలకు విద్యార్థి దశలోనే అవయవదానంపై అవగాహన పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



డీఆర్వో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

కర్నూలు(సెంట్రల్): చెన్నై–సూరత్ జాతీయ రహదారి కోసం భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారాన్ని మంజూరు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన బాధిత రైతులతో కలిసి డీఆర్వో కె.మధుసూదన్‌రావుకు వినతి పత్రం ఇచ్చారు. ఎకరాకు రూ.12.50 లక్షలను ప్రభుత్వం పరిహారంగా ప్రకటించిందని, అయితే 30 శాతం వరకు పెంచేందుకు కలెక్టర్‌కు అధికారం ఉన్నా కేవలం పది శాతం మాత్రమే ధరను పెంచడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. కార్యక్రమంలో రైతులు సుంకన్న, పెద్ద కర్రెన్న, నాగన్న, రంగన్న, మద్దిలేటి, కర్ణ,జమ్మన్న, వెంకట్రాముడు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ



ధ్వజస్తంభం ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

మిడుతూరు: లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ నూతన ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవం గురువారం గిరిధర్ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా సాగింది. ఉదయం 6 గంటలకు ప్రాతఃకాల పూజలు, హోమాలు నిర్వహించారు. ఉదయం 10.40 గంటలకు యంత్రప్రతిష్ఠ, శిఖర, ధ్వజ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, బింబకల్యాణం, కక్షాజ్వాల దర్శణం తదితర విశేష పూజాధిత కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టారు. మధ్యాహ్నం డోలు విద్యాంసుడు నారాయణ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆలయ గాలి గోపురం ప్రారంభం

లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ నూతన గాలిగోపురాన్ని (శిఖరం) శ్రీ దత్త ఆశ్రమ వ్యవస్థాపకులు, వేదపండితులు జూలకంటి మల్లికార్జున రావు శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు.

యువతకు స్ఫూర్తిగా అజీజ్ రచనలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్

కర్నూలు కల్చరల్: ప్రముఖ రచయిత ఎస్‌డీవీ అజీజ్ రచనలు యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని క్లస్టర్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. గురువారం సిల్వర్ జూబ్లీ కళాశాలలో అజీజ్ రచించిన 'వింధ్య' నాటకాల సంపుటి ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అజీజ్ రచనలు సమాజ ప్రయోజననాలను కోరుకుంటున్నాయన్నారు. కథలు, నవలలు, చారిత్రక గాథలు ఇలా విభిన్న సాహిత్ర ప్రక్రియల్లో రచనలు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ సాహిత్యంపై మక్కువ పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి, తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ ఫామీద బేగం, అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మెహబూబ్‌బాషా, రచయిత ఇనాయతుల్లా పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్‌కు సన్మానం



మనోరాజును సన్మానిస్తున్న ఆసుపత్రి అధికారులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన జి.మనోరాజు గురువారం పదవీ విరమణ చేశారు. ఈ మేరకు ఆయనను ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి ఘనంగా సన్మానించారు. మనోరాజు చేసిన సేవలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ హేమనళిని, ఆఫీస్ సూపరింటెండెంట్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం



భక్తజన సందోహం మధ్య సాగుతున్న రథోత్సవం

పత్తికొండటౌన్: పట్టణంలో గురువారం సాయంత్రం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి రథోత్సవం భక్తజన సందోహం మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారి రథాన్ని పూలతో అలంకరించి, ఉత్సవ విగ్రహాలను అందులో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవం నిర్వహించే తేరుబజారు జనాలతో కిక్కిరిసిపోయింది. పెద్ద ఆంజనేయస్వామి దేవాలయం నుంచి తేరుబజారు, పెద్దమసీదు, చక్రాళ్ల రోడ్డు వరకు పెద్ద ఎత్తున ప్రజలు భవనాలు ఎక్కి రథోత్సవాన్ని తిలకించారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తన ఇంటినుంచి ప్రధాన రోడ్డు వెంట తేరుబజారు వరకు పార్టీ శ్రేణులతో కలసి భారీ ర్యాలీగా వచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు. రథానికి కొబ్బరికాయ కొట్టి పూజలుచేసి, రథోత్సవాన్ని ప్రారంభించారు. జూనియర్ సివిల్‌జడ్జి దివ్య రథోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పక్కీరప్ప, ఎంపీపీ నారాయణదాసు, నాయకులు శ్రీరంగడు సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు. డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐలు మురళీమోహన్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

సంస్కరణలకు నాంది పలికిన మహిళలు



గాడిచర్ల, ముచ్చుకోట లక్ష్మీదేవమ్మ చిత్ర పటాల వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: రెండు వందల ఏళ్ల క్రితమే మహిళలు విద్యా రంగంలోనూ అనేక సంస్కరణలతో పత్రికలు నడపటంలో ముందంజలో ఉన్నారని హైదరాబాద్ అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మెహబూబ్‌భాష అన్నారు. గాడిచర్ల హరిసర్వోత్తమ రావు 64వ వర్ధంతిని పురస్కరించుకొని కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం గాడిచర్ల ఫౌండేషన్, కర్నూలు ఎగ్జిబిషన్ సొసైటీ, నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం (నరసం) ఆధ్వర్యంలో 'తెలుగు నాట ఆధునిక స్త్రీ పర్వ ప్రస్థానం' అనే అంశంపై ముచ్చుకోట లక్ష్మీదేవమ్మ గాడిచర్ల రమాబాయి స్మారకోపన్యాసం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషులతో పాటు స్త్రీలు కూడా ఆరోజుల్లో సంస్కరణాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నారన్నారు. ఆంధ్ర రాష్ట్రమంతా మహిళా సమాజాలు ఏర్పరిచే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ మాట్లాడుతూ గాడిచర్ల చేసిన నిస్వార్థ సేవ ఈ తరానికి ఆదర్శం కావాలన్నారు. విద్యార్థులు తమ ప్రధమ కర్తవ్యం బాగా చదువుకోవాలన్నారు. చదువుతోపాటు దేశభక్తి పెంపొందించుకొని దేశ ఉన్నతికి పాటు పడాలన్నారు. గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు కురాడి చంద్రశేఖర కల్కూర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర వీవీఎస్ కుమార్, తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ, ముచ్చుకోట చంద్రశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో సిల్వర్ జూబ్లీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ రమణయ్య, ఉస్మానియా కళాశాల అధ్యాపకులు మన్సూర్ రహమాన్, విశ్రాంత సైనిక్ అధికారి కేసీ రాముడు, అధ్యాపకులు దండబోయిన పార్వతీ దేవి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేజీ గంగాధర్‌రెడ్డి, రాధారాణి, లక్ష్మయ్య, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం నూతన కమిటీ



నూతనంగా ఎన్నికైన బ్రాహ్మణ సంఘం సభ్యులతో మనోహరరావు

కర్నూలు కల్చరల్: స్థానిక సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో గురువారం బ్రాహ్మణ సంఘం నగర కమిటీని గురువారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి హెచ్.కె.మనోహరరావు నూతన కమిటీని ప్రకటించారు. సంఘం నగర అధ్యక్షుడిగా కల్లె చంద్రశేఖర శర్మ, కార్యదర్శిగా హెచ్.కె. రాజశేఖర్‌రావు, కోశాధికారిగా జి.మాధవ ప్రభు, ఉపాధ్యక్షులుగా కురాడి మురళీధర కల్కూర, మాదిరాజు వెంకట రామ మనోహర్, కె.శ్రీధర్ పడిల్లయ, సహాయ కార్యదర్శులుగా కె.వి.భాస్కరరావు, ఉమేష్, ఆమంచి విశ్వేశ్వర శర్మ, క్యానిర్వాహక కార్యదర్శులుగా కేజీ ప్రభాకర్‌రావు, పద్మనాభరావు, సంబరాజు దుర్గాప్రసాద్, బోయినపల్లి శివరామ ప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా సోమనాథమూర్తి, ఇనగండ్ల సూర్యనారాయణ, సంజీవకుమార్, దేవీ ప్రసాద్, రాఘవేంద్ర, నారాయణరావు, సుబ్రహ్మణ్య శాస్త్రి, విశ్వనాథరావు, వీరప్రసాద్, వాణి ప్రకాష్, నాగరాజు, సందురరామశర్మ, గురురాజరావు, సముద్రాల శ్రీధర్, రామోదరరావులను ఎన్నుకున్నట్లు మనోహర్‌రావు తెలిపారు. సంఘం అభివృద్ధికి, బ్రాహ్మణుల ఐక్యతకు కృషి చేయాలని సభ్యులకు ఆయన సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన షేక్ పీరా వలి

గూడూరు రూరల్: కె.నాగలాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మార్కాపురం స్టేజీ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో షేక్ పీరా వలి(45) దుర్మరణం చెందాడు. పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన పీరావలి కర్నూలులో పని ముగించుకుని స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. కోడుమూరు నుంచి కర్నూలుకు వస్తున్న ఆల్విన్ లారీని మార్కాపురం స్టేజీ శివాలయం వద్ద ప్రమాదవశాత్తూ పీరావలి ఢీకొట్టాడు. ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు బండలాగుడు పోటీలు

దేవనకొండ: మండలంలోని కొత్తపేట మస్తాన్‌వలి ఉరుసులో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటలకు వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు,ఐదో బహుమతి రూ.15 వేలు అందజేస్తామన్నారు. వివరాలకు 97051 66401, 90100 23540 నంబర్లను సంప్రదించాలన్నారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు గురువారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు.